సాక్షి
బాపట్ల
గురువారం । 27 । ఫిబ్రవరి । 2025




చెక్‌పోస్టులో కనిపించని సిబ్బంది

ప్రత్తిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల నుంచి గుంటూరు జిల్లాలోకి వచ్చే వాహనాల తనిఖీకి ఏర్పాటైన పెదనందిపాడులో చెక్‌పోస్టులో బుధవారం సిబ్బంది కనిపించలేదు.



ఆకట్టుకున్న పుష్పప్రభ

రేపల్లెరూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని రేపల్లె నుంచి గులాబీలు, చామంతులతో శివ లింగాకృతిలో ప్రభను అరవపల్లి బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు తరలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 531.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

నరసరావుపేట ఈస్ట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 27న గురువారం పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈఓ ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు.

కాకతీయ కమ్మ సత్రానికి రూ.1.85 లక్షలు విరాళం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో కాకతీయ కమ్మ సేవా సమితి సారథ్యంలో కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా కాకతీయ కమ్మ సత్రానికి రూ. లక్షా 85 వేల 66 విరాళంగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా గ్రామస్తుల సహకారంతో విరాళాల రూపంలో నగదు అందజేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కనుల పండువగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ గంగాపార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పర్యవేక్షణలో ఈ వేడుక వైభవంగా జరిగింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. మరో వైపు అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే మార్గాన్ని సైతం పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, అరటి చెట్లతో పచ్చటి పందిరిని తలపించేలా తీర్చిదిద్దారు. మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అభిషేకాలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని స్వామిని దర్శించుకుని అభిషేకాలు జరిపించారు.

రాజధానిలో దొంగల కలకలం



తాడికొండ: రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం నెక్కల్లులోని పోలేరమ్మ ఆలయంలో జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం నెక్కల్లు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గేట్లు పగులగొట్టి ప్రవేశించి అమ్మవారి వెండి వడ్డాణం, కిరీటం, హుండీలో నగదు, కానుకలు, అపహరించారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి సమాచారం తెలియకుండా ఉండేందుకు బాక్సులు సైతం తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పూజారి గుమ్మా గంగయ్య రోజు మాదిరిగానే బుధవారం ఉదయం పూజా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం దేవస్థానానికి రాగా ఆలయం గేటు, తాళం, హుండీ తాళం పగులగొట్టి ఉండటం, పోలేరమ్మ విగ్రహంపై ఉన్న నగలు కనిపించకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులోని వేదాంత ఆసుపత్రి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నలుగురు వ్యక్తులు వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాదం ఎలా జరిగింది, ఏ వాహనం ఢీకొందనే వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చల్లా వెంకటేష్ (15), లాలాపేటకు చెందిన షేక్ అబ్దుల్ అలీ (28) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

హరహర మహాదేవ..!

వైభవంగా అరవపల్లి బాలకోటయ్య తిరునాళ్ల



స్వామి అభిషేక ఉత్సవంలో భక్తులు

రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో హోరెత్తాయి. భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఈ ఏటికి ఇద్దరం .... ముందు నాటికి ముగ్గురం అంటూ నవదంపతులు శివయ్యను స్మరించుకుంటూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి లింగోద్భవ వేళ నుంచే స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ప్రత్యేక రుద్రాభిషేక మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యువత ప్రభలను కట్టి భక్తి శ్రద్ధలతో డప్పువాయిద్యాల నడుమ వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి స్వామికి నివేదించారు. గొల్లభామ పేరంటాళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. రంగుల రాట్నం, బొమ్మల దుకాణాలు, తినుబండారాల దుకాణాలు కిటకిటలాడాయి. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక బందోబస్తు, రెవెన్యూ అధికారులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. మోళ్లగుంట, విశ్వేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్యశిబిరాలు నిర్వహించారు. తుమ్మల, బొబ్బర్లంక పశువైద్యాధికారులు మూగజీవాలకు వైద్యసేవలు అందించారు.

సేవా సంస్థల వితరణ

తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు సంస్థలు సేవలు అందించాయి. అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం, శ్రీవేద గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, వాసవీ క్లబ్ మైత్రి కపుల్స్–వాసవీ క్లబ్ వనిత, పరిటాల యువసేనల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, పొంగలి, మజ్జిగ ప్రసాదాలను పంపిణీ చేశారు.



పూజలు అందుకున్న బాల కోటేశ్వర స్వామి

గోవాడకు పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం భక్తుల రద్దీ

అమర్తలూరు (వేమూరు): మండలంలోని గోవాడలో వేంచేసి ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి దర్శనం కోసం మహా శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు బుధవారం పోటెత్తారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్యూలైన్లలో వేచి చూసి బుధవారం తెల్లవారు జాము నుంచి స్వామిని దర్శించుకున్నారు. గతంలో కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగిందని కార్యనిర్వహణాధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. భక్తులు ప్రభలను వాహనాలకు కట్టి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు స్వామి దర్శనం చేసుకున్నారు. కాకతీయ అన్నదాన సత్రం, శ్రీబాల కోటేశ్వర స్వామి పరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదాన సత్రం, శ్రీ బాల కోటేశ్వర స్వామి బ్రాహ్మణ అన్నదాన సత్రం, శ్రీలీలాభవాని పద్మశాలీయ బహుత్తమ సంఘం అన్నదాన సత్రం ద్వారా భక్తులకు అన్నదానం చేపట్టారు. స్థానికులు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.



మహా శివరాత్రిని పురస్కరించుకుని చినగంజాం తిరునాళ్లలో బుధవారం రాత్రి కాంతిలీనుతున్న విద్యుత్ ప్రభలు

పట్టువస్త్రాలు సమర్పణ



స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ, పలు సేవా సంస్థలు ఏర్పాటు చేసిన ప్రసాదాల స్టాళ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, అనగాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న ప్రభలు



కాంతులీనుతున్న అరవపల్లి బాల కోటేశ్వరస్వామి ఆలయం



కారుమూరులో విద్యుత్‌ప్రభ

రేపల్లె రూరల్: బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు వివిధ గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రభలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. కారుమూరులోని అమరలింగేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో రూపొందించిన విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణలో బాలకోటయ్య ఆలయం కనువిందు చేసింది.

మార్మోగిన శివనామస్మరణ



చినపరిమి గ్రామంలో రామ లింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వేమూరు: నియోజక వర్గంలోని శివాలయాల్లో మహా శివరాత్రి పూజల సందర్భంగా శివనామస్మరణ బుధవారం మార్మోగింది. వేమూరు మండలంలోని చావలి, పెరవలి, జంపని, వేమూరు గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. కొల్లూరు మండలంలోని కోటిపల్లి, చిలుమూరు, అనంతవరం, పెసర్లంక, చింతర్లంక గ్రామాల్లో కూడా శివరాత్రి పూజలు వైభవంగా సాగాయి. భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు, సూరేపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి గుడిలో ఉదయం 6 గంటల నుంచి అభిషేకాలు జరిగాయి. రాత్రి 10 గంటలకు అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు శివాలయంలోనే జాగారం చేశారు. మండల కేంద్రంలోని శ్రీ గంగా బాల త్రిపుర సుందరి సమేత శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడు పోలింగ్

- బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఎన్నికలు
- బరిలో 25 మంది అభ్యర్థులు
- 34 పోలింగ్ బూత్‌లలో 24,493 మంది ఓటర్లు
- నేడు పాఠశాలలకు సెలవు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం పోలింగ్ జరగనుంది. బాపట్ల జిల్లాలో మాత్రం బాపట్ల, రేపల్లె, వేమూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రమే ఓటింగ్ ఉంటుంది. 12 మండలాల పరిధిలో మొత్తం 24,493 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందు కోసం చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, బాపట్ల, రేపల్లె అర్బన్ మండలాల్లోని ప్రాంతాలతో కలిపి మొత్తం 34 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

25 మంది అభ్యర్థులు

కూటమి తరఫున ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావుల మధ్య ప్రధాన పోటీ ఉంది. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరు మంగళవారంతో ప్రచారం ముగించారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ నిర్వహణకు పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు కలిపి 290 మంది సిబ్బందిని నియమించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 267 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఎన్నికల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ సదుపాయం కల్పించారు. గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

పీడీఎఫ్ అభ్యర్థికే అనుకూలతలు

పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేఎస్ లక్ష్మణరావు ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిచారు. ఆయనకు ఉపాధ్యాయ, వామపక్షాలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. ప్రధానంగా పట్టభద్ర ఓటర్లతోపాటు ఉపాధ్యాయ, ఉద్యోగ ఓటర్లు అండగా ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తారన్న పేరుంది. పైగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీలు ఇచ్చి మోసగించిన తీరుపై అన్ని వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. కూటమిలోని జనసేన, బీజేపీ కేడర్‌తో పాటు అసంతృప్తిలో ఉన్న టీడీపీ వర్గాలు కూడా పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తున్నాయి. ఇది లక్ష్మణరావుకు కలిసొచ్చే అంశం. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు సొంత కూటమి పార్టీల నుంచి తీవ్ర అసమ్మతి తప్పడం లేదు. పూర్తి స్థాయిలో ప్రచారం కూడా నిర్వహించలేకపోయారు. ఓటర్లను నేరుగా కలిసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పచ్చ పార్టీ ఆయన్ను గెలిపించుకునేందుకు ప్రలోభాల పర్వానికి తెరలేపింది.

యథేచ్ఛగా 'బరి'.. తమ్ముళ్లు మరి

- కోడి పందేలు నిర్వహించిన టీడీపీ నేతలు
- మూడు గ్రామాల్లో బరులు ఏర్పాటు
- అడ్డుకోవడంలో పోలీసులు విఫలం
- చేతులు మారిన రూ.కోట్ల నగదు
- రూ.లక్షల్లో జేబులు నింపుకొన్న తమ్ముళ్లు



కొల్లూరు సమీపంలో కరకట్ట దిగువున కోడి పందేలు

కొల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు బరితెగించి కోడి పందేల బరులు ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో బుధవారం పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. టీడీపీకి చెందిన వ్యక్తులు బాహాటంగా బరులు ఏర్పాటు చేయడంతో రూ. కోట్లలో పందేల రూపంలో నగదు చేతులు మారినట్లు సమాచారం. కొల్లూరు పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో కరకట్ట వెంబడి పందేలు జరిగాయి. కొల్లూరు – దోనేపూడి కరకట్ట మార్గంలో కొల్లూరుకు సమీపంలో కోడి పందేలు ఏర్పాటు చేశారు. మండలంలోని దోనేపూడి శివారు కోటిపల్లి పరిసరాలలోని పంట పొలాలలో సైతం నిర్వహించారు. వాహనాల పార్కింగ్, ప్రవేశ రుసుం, పందేల నిర్వహణలో కమీషన్ రూపంలో టీడీపీ నాయకులు రూ.లక్షల్లో జేబులు నింపుకొన్నారు. అనంతవరంలో సైతం రాత్రి సమయంలో కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పలు జిల్లాల నుంచి పందెం రాయుళ్ల రాకతో లైట్లను సైతం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి కోడి పందేలు, పేకాట నిర్వహించారు. ఇంత జరిగాక సమాచారం అందుకున్న పోలీసు అధికారులు ఎట్టకేలకు సిబ్బందిని అనంతవరం పంపించారు. విషయం తెలిసిన నిర్వాహకుడు మాత్రం తమకు అనుమతి ఉందని చెప్పడం గమనార్హం. చివరకు పందేలను అడ్డుకున్నారు.

అ'హర'హం రక్షమాం

- మదినిండా మనోహరుడు
- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- ఉప్పొంగిన భక్తిపారవశ్యం
- కోటప్పకొండ, శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ



విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు బుధవారం పోటెత్తారు. స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తెల్లవారు జామున 3 గంటలకు బిందెతీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు అప్పయ్యగురుకుల్ ఆధ్వర్యంలో అభిషేకం శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేకంగా అలంకారం అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. స్వామి దర్శనభాగ్యం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఫలితంగా క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు చేశారు. త్రిముఖ శివలింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాత కోటయ్య స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండ కింద నుంచి 65 సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేసింది. ఘాట్‌రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ప్రభల వద్ద కోలాహలం..

కోటప్పకొండకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే భారీ విద్యుత్ ప్రభల వద్ద కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రభల నిధి వద్దకు 20 భారీ విద్యుత్ ప్రభలు చేరుకున్నాయి. వీటి ముందు నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారు. కొండ కింద పరిసరప్రాంతాల్లో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద రోజంతా సందడి నెలకొంది.

వీఐపీ క్యూ లైన్‌లో భక్తుల తోపులాట...

4గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది వీఐపీ దర్శన పాసులను అధికారులు భారీస్థాయిలో జారీ చేశారు. ఓపక్క పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అధికారులు వీఐపీ పాసులు ఎవరికి జారీ చేశారో అర్థం కాని విషయం. సుమారు 30 వేల వీఐపీ పాసులు జారీ చేశారని సమాచారం. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కలెక్టర్, ఎస్పీ, ఆలయ అధికారులు వీఐపీ పాసులకు ఎలా అనుమతించారని ప్రశ్నిస్తున్నారు. కూటమి నేతలు, కార్యకర్తలకు భారీ స్థాయిలో వీటిని అందించారని, పట్టభద్ర ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం అధికారులు విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా అసంబద్ధంగా జారీ అవుతున్న వీఐపీ పాసులను ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆపి ఉంటే ఆలయానికి టికెట్ల రూపంలో భారీ ఆదాయం వచ్చేదంటున్నారు. మరోవైపు భారీ స్థాయిలో పాసుల జారీతో తెల్లవారుజాము నుంచే వీఐపీ క్యూలైన్లలో భక్తుల తాకిడి నెలకొంది. ప్రధాన ఆలయంలోని నందీశ్వరుడు విగ్రహం వద్ద నుంచి గాలిగోపురం వరకు మెట్ల మీద వీఐపీ పాస్ భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రధాన ఆలయంలోకి వెళ్లే సమయంలో భక్తులు మధ్య పలుమార్లు తోపులాట జరిగింది. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీఐపీ క్యూలైన్లో భక్తుల రద్దీ పెరగడంతో వారిని వీవీఐపీ క్యూ లైన్ లోకి అనుమతించారు. దీంతో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. వీవీఐపీలకు రూ.200 టికెట్ కొన్ని భక్తుల క్యూలైన్ దర్శనాన్ని ఆపి దర్శనం కల్పించాల్సి వచ్చింది.



స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పట్టువస్త్రాలు సమర్పణ

సాక్షి, నరసరావుపేట: కోటప్పకొండపై వేంచేసిన త్రికోటేశ్వరుడికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అధికారుల, పూజారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

క్లుప్తంగా

బెజవాడ దుర్గమ్మకు మంగళగిరి పట్టువస్త్రాలు



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బెజవాడ కనకదుర్గ అమ్మవారికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన శ్రీ శివ భక్త మార్కండేయ వంశీకులు బుధవారం చేనేత పట్టు వస్త్రాలను బహూకరించారు. మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జరిగే శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి శివ భక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు బహూకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం ప్రధాన కైంకర్యపరులుగా మార్కండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరి దంపతులు గుత్తికొండ ధనుంజయరావు, విజయ దంపతులు అమ్మ వారికి చేనేత కల్యాణ వస్త్ర నివేదన చేశారు. ట్రస్ట్ చైర్మన్ దామర్ల వెంకట నరసింహం ఆధ్వర్యంలో సభ్యులు చేనేత పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు విభూది, ఫలపుష్పాలు, తదితరాలను 11 సంప్రదాయ వెదురు పళ్లెంలో దుర్గమ్మ ఆలయానికి చేరుకోగా ఆలయ అసిస్టెంట్ ఈఓ రత్నరాజు మేళతాళాలతో మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి అభిషేకాలు నిర్వహించి వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ట్రస్టీలు చిల్లపల్లి మోహనరావు, గంజి చిరంజీవి, అందె నాగప్రసాద్, దామర్ల రాజు, శ్యామ్, పూర్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్వారీ కిటకిట



చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బాలకోటేశ్వరస్వామిని దర్శించుకుని తరించారు. ఆలయ ఆవరణకు సుమారు 15 భారీ విద్యుత్ ప్రభలు చేరుకున్నాయి. వందల సంఖ్యలో చిన్న, బాల ప్రభలు తరలివచ్చాయి. స్వామి దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష ఆధ్వర్యంలో తెనాలి డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో 12 మంది సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, 300 మందికిపైగా పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద పులిహోర, పొంగలి, లడ్డూ, మజ్జిగ పంపిణీ చేశారు.



పుష్కర ఘాట్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు



పుణ్యస్నానాల అనంతరం శివలింగాన్ని పూజిస్తున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

- శివపార్వతులకు విశేష పూజలు
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

తాడేపల్లిరూరల్: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవాలయాలన్నీ శివనామంతో హోరెత్తాయి. సీతానగరం కృష్ణాతీరంలో పుష్కర్ ఘాట్‌ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఘాట్ వద్ద, కొండపైన, మరోవైపు శివాలయాలు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో శివుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వారధి వద్ద కృష్ణానదీ తీరంలో ఉన్న శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలో సోమేశ్వరాలయం, బాలా త్రిపుర సుందరి తాండవేశ్వర దేవస్థానం, ఉండవల్లి, కొలనుకొండ, ఇప్పటం, గుండిమెడ, చిర్రావూరు, పెనుమాక తదితర గ్రామాల్లో శివాలయాల్లో శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు

జంగాల సందడి.....

తాడేపల్లి కృష్ణానదీ తీరంలో జంగాలు సందడి చేశారు. తమ పెద్దలకు పిండప్రదానాలు సమర్పించే కుటుంబ సభ్యులను కలసి వారి పెద్దల పేర్ల మీద జంగాలు కథలు చెబుతూ సందడి చేశారు.

చైతన్య తపోవనంలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో చైతన్య తపోవనంలో మహాశివరాత్రి సందర్భంగా శివకేశవ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

మహాశివరాత్రిని పురస్కరించుకుని మాతా శివానంద ఆధ్వర్యంలో ఏకాదశ పంచామృత రుద్రాభిషేకాలు, 108 స్ఫటిక లింగాలకు భస్మాభిషేకం నిర్వహించారు.

దాబా నిర్వాహకులపై మందుబాబుల దాడి

ముగ్గురికి గాయాలు



గాయపడిన గూగుల్ల, రాజు, మున్నా

మార్టూరు: మద్యం మత్తులో ఉన్న యువకులు ఓ దాబా నిర్వాహకులపై బీరు సీసాతో దాడి చేసిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మార్టూరు జాతీయ రహదారిపై జొన్నతాళి స్టేజి వద్ద బుధవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తులు చాలా కాలంగా జాతీయ రహదారి పక్కన జొన్న తాళి సమీపంలో సూర్య దాబా నిర్వహిస్తున్నారు. మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన 8 మంది యువకులు బుధవారం రాత్రి దాబా వద్ద మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో వారిలో వారికి గొడవ పెరిగి అరుపులు, కేకలు వేసుకోవడంతో దాబా నిర్వహిస్తున్న గూగుల్లా అనే వ్యక్తి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు వెంటనే గూగుల్లా తలపై బీరు సీసాతో దాడి చేశారు. అక్కడ ఉన్న కుర్చీలు, బల్లలు ఇతర సామగ్రి చిందరవందరగా విసిరి వేశారు. దాబాకు చెందిన రాజు, మున్నా కూడా వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా పగిలిన బీరు సీసాతో గాయపరిచి పారిపోయారు. స్థానికుల సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు తమ సిబ్బందితో దాబా వద్దకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుల్లో కోలలపూడికి చెందిన ఓ ఆర్ఎంపీతోపాటు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా న్యూస్ సేకరణ కోసం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లిన ఓ విలేకరిని కోలలపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అడ్డుకుని 'నీవు ఎవరినీ కలవాల్సిన అవసరం లేదు. కేసు పెట్టుకోవడం లేదు. రాజీ చేస్తున్నాం' అని వెనక్కి పంపడం గమనార్హం.

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు

నగరం: మహా శివరాత్రి పండుగ సందర్భంగా గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి ట్రాక్టర్‌లో బయలుదేరిన ట్రాక్టర్‌కు చెందిన ట్రక్కు తిరగబడి యువకులకు గాయాలైన ఘటన నగరం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై భార్గవ్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దాసరి పాలెం గ్రామానికి చెందిన కొందరు యువకులు గోవాడ తిరునాళ్లకు వెళుతున్నారు. నగరం గ్రామ చివరిలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవరు తప్పించబోయాడు. ట్రాక్టర్ అదుపు తప్పి ట్రక్కు తిరగబడటంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని వెంటనే రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు, స్వల్పగాయాలపాలైన మరికొందరిని నగరం పీహెచ్‌సీకి తరలించారు. జరిగిన ఘటనపై ఎస్సై విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాయపడిన యువకుడు చికిత్స పొందుతున్న దృశ్యం

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్లు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధి భైరవేశ్వరస్వామి మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 7 జతలు ఎడ్లు పాల్గొనగా.. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరయ్యస్వామి చౌదరికి చెందిన ఎడ్లు 1,558 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదే విధంగా మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎడ్లు 1,443 అడుగులు, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాత్విక్ ఎడ్లు 1,330, రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొర్రా రవితేజ చెందిన ఎడ్ల జత 1,296 అడుగులు లాగి తర్వాత వరుస బహుమతులు సాధించాయి. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను ఎడ్ల యజమానులకు దేవస్థానం ధర్మకర్త మధిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి అందజేశారు.



రామాపురంలో బండ లాగుతున్న ఎడ్లు

బాలలను పనిలో పెట్టుకోవడం నిషేధం

నెహ్రూనగర్: 14 సంవత్సరాలలోపు బాల బాలికలతో పని చేయించుకోవడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గాయత్రీదేవి పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో జిల్లా స్థాయి బాలల పంచాయతీ, బాలలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలలు పనుల్లో వినియోగించినట్లయితే 6 నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష, 20 వేలు నుంచి 50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.ఆరోగ్య ప్రమీల మాట్లాడుతూ బాలలందరూ సెల్ ఫోన్స్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. నేటి సమాజంలో బాలలపై అనేక రకాల వివక్ష, వేధింపులు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా జరుగుతున్నాయని, వీటి గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.



సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఆరోగ్య ప్రమీల తదితరులు

విధి ఆటలో నలిగిన స్నేహం

- ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు బాలురు దుర్మరణం
- క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లి వస్తుండగా ఘటన
- పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం



సంతోష్ కుమార్ (ఫైల్)



కూరపాటి లిఖిత్ (ఫైల్)

సత్తెనపల్లి: వారిద్దరూ ప్రాణ స్నేహితులు.. తరగతులు, వయసులు, పాఠశాలలు.. వేరేనే.. కానీ మనసు మాత్రం ఒక్కటే. సెలవు వస్తే ఎక్కడికైనా కలిసే వెళతారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు బుధవారం సెలవు రావడంతో కొద్దిసేపు సరదాగా కలిసి ఆడుకునేందుకు పొద్దు పొద్దునే బయలు దేరారు. ద్విచక్రవాహనం పై ఆటలకు వెళ్లి వస్తుండగా వీరి అన్యోన్యతపై విధికి కన్నుకుట్టింది. ఇద్దరినీ బలి తీసుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అచ్చంపేట రోడ్‌లో గల సాయికృష్ణ సినిమా థియేటర్ దగ్గరలో బుధవారం ఈ దారుణం చోటుచేసుకుంది. పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని వడ్డవల్లి బ్రహ్మం గారి గుడి ప్రాంతంలో నివసించే తోట సంతోష్ కుమార్ (15) పట్టణంలోని భాష్యం స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్కూలుకి సెలవు ఇవ్వడంతో క్రికెట్ ఆడుకునేందుకు ఉదయాన్నే తన ఇంటి దగ్గర ఉండే స్నేహితుడు లింటిల్ ఏంజల్స్‌లో 5వ తరగతి చదివే కూరపాటి లిఖిత్(11) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కు దగ్గరకు వెళ్లారు. అక్కడ మిత్రులు ఎవరూ కనిపించక పోవడంతో మళ్లీ తిరిగి ప్రయాణం అవుతూ అచ్చంపేటరోడ్‌లోని రైల్వేగేట్ వద్ద నుంచి సాయి కృష్ణ సినిమా థియేటర్ వైపు వస్తూ పాత లిక్కర్ మాల్ సమీపంలో రోడ్డుమీద నిర్లక్ష్యంగా ఆపి ఉంచిన గడ్డి మోపు ట్రాక్టర్ సైడ్ ఉండేటువంటి డోర్లు తీసి ఉంచడంతో ఉదయాన్నే 7 గంటల ప్రాంతంలో మంచు కురుస్తూ ఉండడంతో అది కనపడని సంతోష్ కుమార్ వెళ్లి ఆ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం తగిలి సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న లిఖిత్ మెడ నరాలు విరిగి కింద పడిపోవడంతో స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ లిఖిత్ తుదిశ్వాస విడిచాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ఇరువురి మృతదేహాలకు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుల కుటుంబ సభ్యులకు అందించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పండగ రోజు రెండు నిండు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

ఒక్కగానొక్క కొడుకు..

ఒక్కగానొక్క మగబిడ్డ, వంశోద్ధారకుడ్ని లేకుండా చేశావా శివయ్యా.. అంటూ కూరపాటి లిఖిత్ తల్లిదండ్రులు సుధీర్, సుజాతలు విలపించారు. రోడ్డు ప్రమాద వార్త తెలియగానే మృతుడి తల్లి సుజాత ఇంటిలో స్పృహతప్పి పడిపోయింది. కూరపాటి సుధీర్, సుజాత దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సుధీర్ పట్టణంలో ఫ్యాన్సీ దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆడుకునేందుకు స్నేహితుడితో కలిసి వెళ్లి రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందటంతో జీర్ణించుకోలేక లిఖిత్ మృతదేహాన్ని గుండెలకు హత్తుకుంటూ రోదించారు.

ఆటలంటూ అనంత లోకాలకు ...

మంగళవారం సాయంత్రం వడ్డవల్లి నుంచి విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు పయనమయ్యే సమయంలో సరదాగా గడిపిన బిడ్డ ఆటలంటూ పొద్దు పొద్దునే వెళ్లి అనంత లోకాలకు వెళ్లావయ్యా అంటూ మృతుడు తోట సంతోష్‌కుమార్ తల్లిదండ్రులు జానకీరామ్, నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జానకీరామ్‌కు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జానకీరామ్ కోళ్ల ఫారం, కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. రెండవ కుమారుడు సంతోష్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో పండుగ పూట మృతి చెందడం జీర్ణించుకోలేక విలపించారు.

ఏలేశ్వరం.. సుమనోహరం

- ఏలేశ్వరం స్వామి గట్టుకు పోటెత్తిన భక్తులు
- ఏపీ టూరిజానికి రూ.3.60 లక్షల ఆదాయం




ఏలేశ్వరం స్వామి దేవాలయానికి వెళ్తున్న భక్తులు



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయపురిసౌత్: శ్రీశైల క్షేత్రానికి ఈశాన్య ద్వారంగా మహోన్నత దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్ జలాశయం మధ్యన సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరం స్వామి జాతరకు బుధవారం మహా శివరాత్రిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు భారీగా తరలి వచ్చారు. ఏలేశ్వరం గట్టు హర నామస్మరణతో మారుమోగింది. అర్చకుడు శ్రీ పాద సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఏలేశ్వరస్వామి ఆలయం, అనుపులోని రంగనాథస్వామి ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఏలేశ్వర స్వామి ఆలయంలో రాత్రి 12 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ప్రత్యేక లాంచీ సర్వీసులను ఏలేశ్వరం గట్టుకు నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుపు వద్ద విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏపీ పర్యాటక శాఖకు లాంచీల ద్వారా రూ.3.60 లక్షలు ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ మేనేజర్ అడపా శివారెడ్డి తెలిపారు. ఏలేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చిన్నరామ స్వామి, లాంచీ యూనిట్ సిబ్బంది వినయతుల్లా, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయపురి సౌత్‌లోని లాంచీస్టేషన్ వద్ద శివాలయం, శ్రీ గంగా పార్వతీ సమేత అమరలింగేశ్వర స్వామివారి ఆలయం, భైరవుని పాడులోని కాలభైరవేశ్వర ఆలయం, శివ నాగేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వారంతపు ప్రత్యేక రైలు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా చర్లపల్లి- కాకినాడ టౌన్- చర్లపల్లి- నరసాపూర్ మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం వారంతపు ప్రత్యేక రైలు కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ బుధవారం తెలిపారు. రైలు నంబర్ 07031 చర్లపల్లి- కాకినాడ టౌన్ రైలు ఈనెల 28వ తేదీ మార్చి 7, 13, 21, 28వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 7.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబర్ 07032 కాకినాడ టౌన్- చర్లపల్లి రైలు మార్చి 2, 9, 16, 23, 31వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని ఈ రైలు కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పారు. రైలు నంబర్ 07233 చర్లపల్లి- నరసాపూర్ రైలు ఈనెల 28, మార్చి 7, 13, 21, 28వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు బయలు దేరి నరసాపూర్ స్టేషన్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబర్ 07234 నరసాపూర్- చర్లపల్లి రైలు మార్చి 3, 9, 16, 23, 31వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని వివరించారు. ఈ రైలు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నరసాపూర్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

వైద్య కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1983 బ్యాచ్ విద్యార్థులు వైద్య కళాశాలలో అనాటమి లెక్చర్ గ్యాలరీ ఆధునికీకరణ కోసం రూ.25 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ప్రముఖ పల్మనాలజిస్ట్, కనుమూరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కనుమూరి శ్రీనివాస్, విజయవాడకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగభైరవ తిరుమలరావు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారీని కలిసి రూ.25 లక్షల చెక్కు అందజేశారు. డాక్టర్ సుందరాచారీ మాట్లాడుతూ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. దాతల సాయంతో వైద్య విద్యార్థులకు రూ.80 లక్షలతో రెండు బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. కళాశాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేశామన్నారు. సుమారు రూ.3 కోట్లకు పైగా దాతలు విరాళాల రూపంలో వైద్య కళాశాల అభివృద్ధికి అందించారని, వారిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది కళాశాల అభివృద్ధికి విరాళాలు అందించేందుకు ముందుకు రావాలన్నారు.



డాక్టర్ సుందరాచారికి చెక్కు అందిస్తున్న దృశ్యం

ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు అరెస్ట్

- దొంగిలించిన సొత్తు కొనుగోలు చేసిన మరో ఇద్దరు కూడా...
- రూ.14.65 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఇద్దరు పాత నేరస్తులను, దొంగిలించిన ఆభరణాలను కొనుగోలు చేసే మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ నలుగురి వద్ద రూ.14.65 లక్షల ఖరీదైన బంగారం, వెండి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో బుధవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరు ఆర్టీసీ కాలనీ ఐదో వీధి శివార్లో ఉండే ఏలేశ్వరం బాలసుదర్శన్‌శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15న విజయవాడలోని బంధువుల ఇంటి వెళ్లారు. తిరిగి 17వ తేదీ ఉదయం ఇంటికొచ్చారు. ఇంటి తాళం పగిలిపోవడం, పడక గదిలోని లాకర్‌లో దాచిన బంగారం, వెండి వస్తువులు, రూ.35 వేలు, చేతి వాచీ కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగిందని భావించిన బాలసుదర్శన్ శర్మ, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ (పీఎస్)లో ఫిర్యాదిచ్చారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ వైవీ.సోమయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో లాలాపేట ఎల్ఆర్ కాలనీ ఐదో వీధికి చెందిన సయ్యద్ నాగూర్‌బాషా, స్వర్ణభారత్ నగర్ మూడో వీధికి చెందిన ఉప్పాల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళగిరి గ్రామీణ పీఎస్ పరిధిలోనూ మరో రెండు చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అయితే ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన బంగారం, వెండి వస్తువులను స్వర్ణభారతి నగర్ ఐదో వీధికి చెందిన బత్తుల గోపీనాథ్, నల్గొండ జిల్లా పియాంపల్లి మండలం రంగారెడ్డిగూడెం గ్రామ వాసి ఊరాది జనార్దన్‌లకు విక్రయించారని గుర్తించారు. దీంతో నాగూర్‌బాషా, సురేష్, గోపీనాథ్, జనార్దన్‌లను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ.14.65 లక్షల ఖరీదైన 134 గ్రాముల బంగారం, 2,889 గ్రాముల వెండి సొత్తు, రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ(క్రైం), తూర్పు డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, పాత గుంటూరు సీఐ వైవీ సోమయ్య పాల్గొన్నారు.



చోరీ సొత్తును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్